# శూన్యం

- పులిపాక కనకదుర్గ

కథా నిలయం
శ్రీకాకుళం

నిర్జీవమయిన గోడలు!

నిశ్శబ్దం. ఘనీభవించిన నిశ్శబ్దం.

చిక్కటి చీకటి. కర్కశమయిన రాత్రి.

అన్నింటినీ మించి స్తబ్దత.

నిరాశకంటే కూడా భయంకరమైనది స్తబ్దత.

చుట్టూవున్న గాలి, ఆకాశం... ఇంకా చెప్పాలంటే శూన్యం కూడా నిస్సారంగా, నిస్తేజంగా తోస్తున్నాయి.

'తెల్లవారితే బాగుంటుంది. ఎంతకీ తెల్లవారదేం!

అబ్బ ఎంత సుదీర్ఘంగా ఉందీ రాత్రి?

అసలు తెల్లవారుతుందా? వెలుగనేది వస్తుందా?'

"బాబూ భార్గవా! పెళ్లి చేసుకోరా. ఈ మిగిలిన జీవితంలో నాకు మిగిలిన కోరిక అదొక్కటే" చీకటి లోతుల్లోంచి అమ్మ గొంతు.

'పెళ్లా? వద్దే వద్దు. పెళ్లంటే బరువూ బాధ్యతలు. పెళ్లి స్వేచ్ఛకు సమాధి. పెళ్లంటే దగా. పెళ్లంటే ఒకరినొకరు చేసుకునే అందమయిన మోసం. అందుకే నాకసలు పెళ్ళే వద్దు' మనసులో భావాలు గొంతు దాటనేలేదు.

అమ్మ మొహంలో అంతులేని విచారం.

మళ్ళీ నిశ్శబ్దం.

ఎంతకీ కుదరని కటిక చీకటి.

ఈ నిశీధి సామ్రాజ్యంలో ఒంటరి చక్రవర్తిని నేను.

దప్పిక తీరని ఎడారి బాటసారిని నేను.

★★★

కాఫీ తాగుతూ పేపర్ చదువుకుంటున్నాను.

"అయ్యగారూ! వంట ఏం చేయమంటారు?" కాఫీ కప్పుకోసం వచ్చి అడిగింది లక్ష్మి.

"ఏదో ఒకటి చెయ్యి" కప్పందిస్తూ విసుగ్గా అన్నాడు.

మరో గంటకల్లా లక్ష్మి వంట ముగించుకుని అన్నీ హాట్‌పాక్‌లో సర్దేసి వెళ్లిపోయింది.

నేను కూడా స్నానం చేసి డ్రెసప్ అయ్యి బ్రేక్‌ఫాస్ట్ చేసి బయటపడ్డాను.

"గుడ్‌మార్నింగ్ సార్" ఆఫీసులో అడుగుపెట్టగానే ఎప్పట్లా విష్ చేసింది పి.ఎ సునంద.

తెలుపుమీద పసుపు పూలున్న కాటన్ శారీ, పసుపురంగు జాకెట్‌లో ప్లెజెంట్‌గా ఉంది సునంద. ఈమధ్యనే తను ఈ ఆఫీసులో చేరింది.

నా కాబిన్‌లోకి వెళ్లగానే ఇంటర్‌కమ్‌లో సునందని పిలిచాను.

లెటర్‌ప్యాడ్, పెన్సిల్‌తో వచ్చింది.

"ప్లీజ్ టేక్ యువర్ సీట్" మృదువుగా చెప్పాను.

ఒద్దికగా కూర్చుంది సునంద.

పరిశీలనగా చూసాను.

చక్కటి కనుముక్కు తీరు, మంచి శరీరఛాయ, తీరయిన సౌష్టవం, ముప్పై ఏళ్లుంటాయేమో సునందకి.

భర్త పోయాడు. కన్యాశుల్కం గిరీశం చెప్పినట్లు యంగ్, బ్యూటిఫుల్ విడో సునంద.

మా ఆఫీసులో జాయినయినప్పటి నుంచీ ట్రై చేస్తున్నాను. ప్చ్! సునంద చాలా మొండిఘటం. లొంగిపోయే రకం కాదు. కానీ నేను మాత్రం దేన్నీ అంత తేలిగ్గా వదిలిపెట్టే రకంకాదు. ఎప్పటికయినా సునందని సాధించి తీరుతాను.

"సర్ రమ్మన్నారు" కుర్చీలో ఇబ్బందిగా కదులుతూ అంది సునంద.

పిలిచాను కాబట్టి తోచిన పని చెప్పి పంపేసాను.

పని వత్తిడిలో లంచ్ టైమయింది అన్న సంగతి కూడా గమనించలేదు.

నేను మరచిపోయినా డ్రైవర్ రాజయ్య మాత్రం ఠంచనుగా ఒకటిన్నరకల్లా క్యారియర్‌తో తయారయ్యాడు.

రాజయ్య డ్రైవరే కాదు, ఒకరకంగా నా పర్సనల్ సెక్రటరీ అనొచ్చు. రాజయ్య భార్య లక్ష్మి ఉదయం వంట చేసి చక్కగా అన్నీ హాట్‌పాక్‌లో సర్దేసి క్యారియర్ కూడా సిద్ధం చేస్తుంది. ఇహ రాజయ్య నమ్మినబంటులా నేను వేళకు భోజనం చేస్తున్నానా లేదా అన్నది గమనిస్తూ నన్నంటిపెట్టుకునే ఉంటాడు.

"ఏం రాజయ్యా భోజనం చేయక తప్పదంటావా?" ఫైల్ క్లోజ్ చేస్తూ అడిగాను.

సమాధానం ఏం చెప్పాలో తెలియక బుర్ర గోక్కుంటూ సిగ్గుపడిపోయాడు రాజయ్య.

"ఊ... సర్లే వడ్డించు" చేతులు కడుక్కుని సోఫాలో కూర్చున్నాను.

ఉడెన్ టీపాయ్ మీద ప్లేట్లో పదార్థాలన్నీ కొద్దికొద్దిగా వడ్డించాడు.

"ఎంతయినా నువ్వు అదృష్టవంతుడివి రాజయ్యా" పదార్థాల రుచి చూసిన తరువాత అన్నాను.

"ఎందుకయ్యగారూ" సిగ్గుపడిపోతూ అన్నాడు రాజయ్య.

"ఎందుకేంటి? ఇంత చక్కటి వంట చేసి పెట్టే భార్య దొరకడం అదృష్టం కాదూ"

"పెళ్లి చేసుకుంటే మీక్కూడా ఇంతకంటే చక్కగా వంట చేసి పెట్టే అమ్మగారు దొరికేవారు" అనేసి గబుక్కున నాలిక కరుచుకున్నాడు రాజయ్య.

నేనది విననట్టే నిదానంగా భోజనం చేసి తిరిగి ఫైళ్ళు చూడడం మొదలుపెట్టాను.

నాలుగుదాటిన తరువాత అన్నయ్య వచ్చాడు.

"ఏరా! బొత్తిగా నల్లపూసవయ్యావు" రాగానే నిష్ఠూరంగా అన్నాడు.

అన్నయ్య మాటలకు నవ్వుకుంటూ ఫ్లాస్క్‌లో కాఫీ కప్పులోకి ఒంపి ఇచ్చాను.

"అమ్మెలా వుంది?" అన్నయ్య కాఫీ తాగుతుంటే అడిగాను.

"ఎలా వుంటుంది? అమ్మకెప్పుడూ నీ గురించే దిగులు? అమ్మకోసమైనా పెళ్లి చేసుకోరా. పైగా తను నీ దగ్గరుంటే నువ్వెప్పటికీ పెళ్లి చేసుకోవేమోనన్న భయంతో నా దగ్గరే ఉండిపోయింది. ఉండడం అయితే ఉండిపోయిందిగానీ అమ్మకు ఎప్పుడూ నీ గురించే దిగులు"

"అదిసరేగానీ ఇన్నాళ్లకు నామీద దయ కలిగిందేమిటి?" టాపిక్ డైవర్ట్ చేయడానికి అన్నట్లుగా

అడిగాను.

"ఏముంది. రేపు పాప పుట్టినరోజు. నువ్వు తప్పకుండా రావాలి. పైగా చాలా రోజులయిందిగా. అమ్మను కూడా చూసినట్టు వుంటుంది" మరి కాసేపుండి అన్నయ్య వెళ్లిపోయాడు.

అన్నయ్య ఇంజనీరు. వదిన హౌస్‌వైఫ్. ఇద్దరమ్మాయిలు వాళ్ళకి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే అన్నయ్య పెళ్లికాకముందు తన క్లాస్‌మేట్ చెల్లెల్ని ఇష్టపడ్డాడు.

కానీ ఎక్కువ కట్నం ఆఫర్ చేసిన వదిన సంబంధాన్ని ఒప్పుకుని ప్రేమించిన అమ్మాయిని ఇట్టే మర్చిపోయాడు.

చిత్రంగా వదిన కూడా తెలివితేటల్లో అన్నయ్యకు సమ ఉజ్జీ. పట్టుచీర కావాలంటే శుక్రవారం నోములు, డైమెండ్ నెక్లెస్ కావాలంటే సుమంగళి వ్రతాలుచేసి అన్నయ్యను మెప్పించి బీరువా నింపుకుంది.

ఇప్పుడు వాళ్లిద్దరిదీ అన్యోన్యమైన జంట. బంధుమిత్రులలో ఆదర్శప్రాయమైన దాంపత్యం. ఇవన్నీ చూసి చూసి పెళ్లిపట్ల నాకున్న దురభిప్రాయం మరింత పెరిగిపోయింది.

పాపం అమ్మకే నా పెళ్లి గురించి ఎక్కడలేని దిగులు.

ఎన్ని సంబంధాలు చూసిందో. కానీ అమ్మకేం తెలుసు నా మనసు.

ఆఖరికి తను నా దగ్గరుంటే ఎప్పటికీ పెళ్లి చేసుకోనేమోననే భయంతో అన్నయ్య దగ్గరకు వెళ్లిపోయింది.

అయినా పెళ్లిలో ఏముంది? వంచన, నటన తప్ప. కానీ అమ్మకి ఇవన్నీ అర్థమయ్యేలా చెప్పలేకపోతున్నాను.

ఆలోచనలని చెదరగొడుతూ సెల్‌ఫోన్ మోగింది.

అవతలివైపు మూర్తి. "ఏం బాస్ ఎక్కడున్నావు?"

"ఇంకా ఆఫీసులోనే"


"అదేమిటీ బాస్ అలాగంటావు? నువ్వు రాక క్లబ్బంతా చిన్నబోయింది"


"ఏం చేయమంటావు? విపరీతమైన పని"

"ఎవరితో ఇందువదనతోనా? చంద్రికతోనా?" పెద్దగా నవ్వాడు మూర్తి.

నాకూ నవ్వొచ్చింది.

"అదే కాదులే. వెంటనే బయలుదేరుతున్నా" ఫోన్ కట్ చేసాను.





## మైమరపు

ఎవరిదీ మైమరపు. కొంతమంది తినడం కోసం బ్రతుకుతారు. మరికొంతమంది బ్రతకడం కోసం తింటారు. అందాలతార ఐశ్వర్యా రాయ్‌కి తిండి యావ ఎక్కువట. ఎక్కడికైనా ఫంక్షన్‌కి వెళ్లినప్పుడు తనకిష్టమైన వాటిని ఎంతో ఆబగా తింటుందట ఆమె. 'నాకిష్టమైనవి దొరికితే అన్నీ మరచిపోతాను. మా ఫ్రెండ్స్ అంతా నన్ను తెగ తిడతారు. నా జిహ్వా చాపల్యాన్ని నేను వదులుకోలేకపోతున్నాను' అంటోంది.

అరగంటలో క్లబ్ ముందున్నాను.

సిగరెట్ లాస్ట్‌పఫ్ తీసుకుని బయటకు విసిరేసాను.

కారుని పార్కు చేసి లోపలకు నడిచాను. అప్పటికే అక్కడ వున్న మిత్రుల మొహాలు నన్ను చూడగానే విప్పారాయి.

"ఆలస్యమయిందేం?" కోరస్‌గా ప్రశ్నించారు.

"ఏముందీ మామూలే. బిజినెస్ పనులు" ఓ కుర్చీలో కూర్చుంటూ అన్నాను.

"ఏమయినా అదృష్టం అంటే భార్గవదే" కార్డ్సు పంచుతూ అన్నాడు జయరాం.

"అంటే మనం అదృష్టవంతులం కాదన్న మాట" ప్రశ్నించాడు రావ్.

"అన్నమాట కాదు ఉన్నమాట. మనం క్లబ్బుకు వెళ్లాలంటే పెళ్లానికి ఇన్ఫర్మేషన్ ఇవ్వాలి. డ్రింక్ చేసి ఇంటికి వెళ్లాలంటే పిల్లల గురించి ఆలోచించాలి. కానీ భార్గవకేం నలభై దాటినా ఇంకా బాచిలర్ లైఫ్‌ని ఎంజాయ్ చేస్తున్నాడు. అంతకంటే అదృష్టం ఏముంది?"

నాలో నేనే నవ్వుకున్నాను. పెళ్లంటే అందమైన ఊబి అని తెలుసు.

అందులోకి దిగి గిలగిలలాడుతున్న నా ఫ్రెండ్స్‌ని చూస్తుంటే చెప్పొద్దూ కొద్దిగా జాలేసింది.

మూర్తిది పెద్ద ఉద్యోగంకాదు. కానీ వాళ్లావిడకు విలాసవంతమైన జీవితం అంటే మహా మోజు.

దాంతో వాడికి ఇంట్లో మనశ్శాంతి కరువయి ఇలా క్లబ్బుల వెంట తిరుగుతుంటాడు.

జయరాం భార్య కలవారమ్మాయి. వీడిని అస్సలు లెక్క చేయదు.


...ఇలా తరచి చూస్తే ప్రతి ఒక్కడికి ఏదో ఓ సమస్య.

నిజానికి పెళ్ళే ఓ సమస్య. అందరం ఆటలో లీనమయ్యాం. మరో మూడుగంటలు గడిచిపోయాయి.

"ఇహ నేవెళ్తాను" కార్డ్సు టేబుల్‌మీద పడేసి అన్నాడు జయరాం.

"అప్పుడేనా?" వాల్‌క్లాక్ వంక చూస్తూ అన్నాడు మూర్తి.

"ఈ రోజు ఇంట్లో ఏదో పూజ వుంది. మా ఆవిడ నాకోసం ఎదురు చూస్తూ వుంటుంది" అని



చెప్పేసి వెళ్లిపోయాడు జయరాం.

మరోగంటకు మూర్తి, రావ్ కూడా వెళ్లిపోయారు.

నేను కూడా బయటకు వచ్చేసాను.

డిన్నర్ బయటే చేస్తే ఎలాగుంటుందని కొద్దిసేపు అక్కడే నిలబడి ఆలోచించాను.

చివరకు ఇంటికే వెళ్లాలని నిర్ణయించుకున్నాను.

ట్రాఫిక్ ఎక్కువగా లేకపోవడంతో పావుగంటలో గమ్యస్థానానికి చేరుకున్నాను.

సిటీలోకెల్లా పోష్ లొకాలిటీలోవున్న విశాలమైన ఫ్లాట్ నాది.

కారు పార్కు చేసి లోపలకు వెళ్లాను. సోఫాలో కూర్చుని ఓమారు ఇల్లంతా పరికించాను.

ఎటు చూసినా ఐశ్వర్యం ఉట్టిపడే ఖరీదైన అలంకరణ.

మరోమారు ఇంటిని గర్వంగా చూసుకుని డ్రెస్ మార్చుకున్నాను.

వేయించిన జీడిపప్పు, ఫారిన్ స్కాచ్ తెచ్చుకుని టీవీ ముందు కూర్చుని మిడ్‌నైట్ మసాలా చూస్తూ ఎప్పుడు నిద్రపోయానో నాకే తెలియదు.

మెలకువ వచ్చేసరికి లక్ష్మి తన దగ్గరవున్న కీతో తలుపులు తీసుకుని లోపలకు వచ్చి పని చేసుకుంటోంది.

నేను బ్రష్ చేసుకుని వచ్చేసరికి కాఫీ పట్టుకొచ్చింది.

"ఏం లక్ష్మి అలాగే నిలబడ్డావు? జీతం అడ్వాన్స్‌గా ఏమైనా కావాలా?" ఇంకా అక్కడే నిలబడ్డ లక్ష్మిని ఉద్దేశించి అన్నాను.

"ఈరోజు ఆదివారం కదయ్యగారూ. ఏమేం చేయమంటారో చెప్తారని..." నసుగుతూ అంది లక్ష్మి.

ఆ రోజు ఆదివారం అని గుర్తుకు రావడంతో ఎక్కడాలేని హుషారు పుట్టుకొచ్చింది. వెంటనే చంద్రికకు ఫోన్ చేసాడు.

"ఏంటి ఇన్నాళ్లకు గుర్తుకొచ్చానా?" నిష్ఠూరంగా అంది.

"నీ కోపతాపాలు తరువాతగానీ ఇవాళ ఫ్రీయేనా?"

"సారీ భార్గవా. ఈ రోజు నాగార్జునసాగర్ పిక్నిక్‌కి వెళ్తున్నాం. నౌ అయాం ఆన్ ది వే" మెత్తగా చెప్పేసి ఫోన్ పెట్టేసింది చంద్రిక.

చేసేదిలేక జయరాం తదితరులకు ఫోన్ చేసాను.

"నీ ఫ్లాట్‌లో గెట్ టు గెదర్ అంటే ఎలా రాకుండా వుంటాం. హాయిగా ఫ్రీబర్డ్స్‌లా ఉంటాం. కారీ ఆన్ విత్ యువర్ అరేంజ్‌మెంట్స్" ఫోన్‌లోనే భరోసా ఇచ్చారు.

సన్నగా విజిల్ వేస్తూ లక్ష్మిని కేకేసాను.

"లక్ష్మీ ఈరోజు ఫ్రెండ్స్ వస్తున్నారు. ఫిష్ ఫ్రై, ఎగ్ మసాలా, చిల్లీ చికెన్ చెయ్యి. కొద్దిగా వైట్‌రైస్, చపాతీలుకూడా ప్రిపేర్ చేయి"

లక్ష్మీ వెళ్లిపోయింది.

పదకొండుకల్లా చెప్పిన ఐటమ్స్ అన్నీ ప్రిపేర్ చేసి హాట్‌పాక్‌లో పెట్టి వెళ్లిపోయింది.

లక్ష్మి వెళ్లిన కొద్దిసేపటికే మిత్రబృందం వచ్చేసారు.

బీర్ తాగుతూ కార్డ్స్ ఆడుకుంటుంటే టైమే తెలియలేదు. మూడింటికి లంచ్ మొదలుపెట్టాం.

"చికెన్ అదిరింది భార్గవా?" జయరాం అన్నాడు.

"అందుకేగా నిన్న మనం అంతా భార్గవ చాలా అదృష్టవంతుడని అనుకున్నాం" మూర్తి మధ్యలో అన్నాడు.

"అంతేనా? అవకాశం దొరికినప్పుడల్లా అందమైన ఆడవాళ్లతో అందమైన సాయంత్రాలూ..." కన్ను గీటుతూ అన్నాడు రావ్.

సుష్టుగా లంచ్ చేసి మళ్లీ ఆట మొదలు పెట్టాం.

సాయంత్రం ఆరుదాకా ఉండి ఫ్రెండ్స్ సెలవు తీసుకున్నారు.

వాళ్ళు వెళ్లిపోగానే చకచకా డ్రెస్ చేసుకుని అన్నయ్యా వాళ్లింటికి వెళ్లాను.

"బాబాయ్" అంటూ చుట్టేసుకున్నారు అన్నయ్య పిల్లలు.

"ఏం భార్గవా బాగున్నావా?" అభిమానంగా పలకరించింది వదిన.

ఎప్పట్లానే అమ్మ కళ్లల్లో దిగులు, నాన్న మొహంలో బాధ.

ఆ సాయంత్రం అంతా కేరింతలతో సరదాగా గడిచిపోయింది.

పది దాటాక వాళ్ల దగ్గర సెలవుతీసుకుని ఇంటికి వచ్చేసాను.

ఎందుకో అప్పటిదాకా ఎంతో చైతన్యవంతంగా వున్న లైఫ్ వున్నట్టుండి డల్‌గా అయిపోయినట్టనిపించింది.

***

పని వత్తిడి ఎక్కువయింది.

సునందలో మార్పులేదు.

నాలో కోరిక పెరిగిందేగానీ తగ్గలేదు.

మూర్తికి చెన్నై ట్రాన్స్‌ఫర్ అయింది.

మా మిత్ర బృందంలో ఒకరి సంఖ్య తగ్గిపోయింది.

బిజినెస్ పనిమీద పారిస్ వెళ్లాల్సి వచ్చింది కూడా ఇందువదనని తీసుకెళ్లాను. పదిహేనురోజులు ఇట్టే గడిచిపోయాయి.

ఫారిన్ ట్రిప్పుకు, నేను కొనిచ్చిన గిఫ్ట్సుకు ఇందువదన ఎంతగానో మురిసిపోయింది. మానవ సంబంధాలని నిర్దేశించేది ఆర్థికబంధాలే అని మరోసారి రుజువయింది.

మరో ఆర్నెల్లు యాంత్రికంగా గడిచిపోయాయి.

***

ఎన్నాళ్లనుంచో నేను చేస్తున్న గార్మెంట్స్ బిజినెస్‌కు సంబంధించి కొత్త యూనిట్ స్టార్ట్ చేయాలని ఆలోచన.

ఏడాది కష్టపడితే ఇన్నాళ్లకు కార్యరూపం దాల్చింది.

యూనిట్ ప్రారంభోత్సవానికి అమ్మా, నాన్నా, అన్నయ్య, వదిన అంతా వచ్చారు. వదిన కళ్లల్లో స్పష్టమైన అసూయ.

ఫంక్షన్ అయిపోయాక సునందని పిలిపించాను.

"మన కొత్త యూనిట్‌కు మిమ్మల్ని అసిస్టెంట్ మేనేజర్‌గా అప్పాయింట్ చేయాలని నా అభిప్రాయం. మీకు అభ్యంతరం ఏమీలేదుగా?"

ఎగిరి గంతేసినంత పని చేసింది సునంద.

"నిజంగానే అంటున్నారా సర్?" ఆల్మండ్ షేపులోని అందమైన కళ్లను రెపరెపలాడిస్తూ సంభ్రమాశ్చర్యాలతో అడిగింది.

ఆమె చలాకీతనాన్ని చూస్తుంటే ముచ్చటేసింది.

అలాగే కొద్దిక్షణాలు ఆమెనే చూస్తుండిపోయాను.

నన్ను నేను కంట్రోల్ చేసుకోవడానికి చాలా కష్టపడవలసివచ్చింది.

"ఇందులో అబద్ధం చెప్పాల్సిన అవసరం ఏముంది?" ఆమెనే గమనిస్తూ అన్నాను.

సునంద మొహంలో ఇంకా అపనమ్మకం.

"అన్నట్లు మీరు ఈ రోజు ఫ్రీయేనా?"

"ఎందుకు సర్?" హర్షాతిరేకంతో అడిగింది.

"ఈరోజు నిండు పౌర్ణమి. నా బెడ్రూంలోంచి చూస్తే పున్నమి చంద్రుడు మరింత అందంగా కనిపిస్తాడు. వెన్నెల రాత్రిని ఎంజాయ్ చేయడానికి మా ఇంటికి రాకూడదూ?"

మాటలు పూర్తి కాకుండానే చివాలున నిలబడింది సునంద.

కళ్లు అరుణిమను నింపుకున్నాయి.


## వింత గొర్రె

గొర్రె బొచ్చు నుండి ఉన్ని కట్ చేసుకుని మనం హాయిగా స్వెట్టర్లు, సూట్లు కుట్టించుకుంటున్నాం. న్యూజీలాండ్‌లో ఓ వింత గొర్రెను కొనుక్కున్నారు అక్కడి ప్రజలు. ఈ గొర్రెకు విపరీతంగా ఉన్ని పెరిగిపోతోంది. చాలాకాలంగా తప్పించుకుని తిరుగుతున్న ఈ గొర్రెను ఈమధ్య ఎట్టకేలకు పట్టుకున్నారు. గొర్రె బొచ్చును కత్తిరించడంలో గిన్నిస్ రికార్డు సృష్టించిన వ్యక్తిని పిలిపించి జాగ్రత్తగా ఈ గొర్రె ఉన్నిని కట్ చేయించారు. అంతేకాదు, ఈ వింతను చూపించడానికి అక్కడి ఛానల్స్ వారు లైవ్ టెలికాస్ట్ చేసి ప్రజల్ని మంత్రముగ్ధుల్ని చేసారు. అరగంటసేపు సాగిన ఈ కార్యక్రమంలో 27 కేజీల ఉన్నిని కత్తిరించాడు. అంటే ఈ ఉన్నితో 20 మందికి దర్జాగా సూట్లు కుట్టేయవచ్చట!

## చెత్త కార్ల రేసింగ్

కార్ల రేసింగ్ గురించి మనందరికీ తెలిసిందే. అయితే ఇంగ్లండ్‌లో మాత్రం చెత్త, డొక్కు కార్లతో రేసింగ్ పెట్టారు. పాత కారులో బయలుదేరి అన్నిటినీ గుద్దుకుంటూ వెళ్లిపోవాలి. ఈ కార్లు ఎన్నింటిని ధ్వంసం చేసి వెళితే అంత గెలిచినట్లు. దారి పొడవునా అడ్డంకులు పెడతారు. వాటిని దాటుకుంటూ సురక్షితంగా, వేగంగా, తొందరగా వెళ్లినవాళ్ళే విజేతలు. కారు ఎంత తుక్కు తుక్కు అయితే అంత గొప్పట!

–శిరీష




## జంతువుల దినోత్సవం

మనం మదర్స్ డే, వాలెంటైన్స్ డే లాంటివి జరుపుకుంటాం. అయితే అర్జెంటీనా ప్రజలకి ఏప్రిల్ 29న జంతువుల దినోత్సవంగా జరుపుకోవడం అలవాటు. జంతువులన్నింటినీ అలంకరించి వాటికి ఇష్టమైన ఆహారం పెడతారు. వాటిని సంతోషంగా ఉంచడానికి ప్రయత్నిస్తారు. ఈ రోజున జూ అధికారులందరూ జంతువులకి ప్రేమగా పళ్ళు అందిస్తారు. ఏనుగులు, ఎలుగుబంట్లు, తాబేళ్ళు, చిలుకలు, ఉడతలు, ఒంటెలు లాంటి అన్ని జంతువులకి పాక శాస్త్ర నిపుణుల చేత చేయించిన ఐటమ్స్‌ని ప్రేమగా పెడతారు. ఇలా జంతువుల మీద ప్రేమ ఒలకబోయడం ఒక్క అర్జెంటీనా ప్రజలకి మాత్రమే చెల్లింది.

## నీళ్లల్లో నాటక ప్రదర్శన

సినిమాలు, టీవీలు వచ్చాక నాటకాల పరిస్థితి ఘోరంగా తయారైంది. నాటకాలు వేసే వాళ్ళు, చూసేవాళ్లు కూడా బాగా తగ్గిపోయారు. మరి ఇటువంటి పరిస్థితిలో రష్యాలో ఓ నాటక సమాజంవారు ఓ అడుగు ముందుకు వేసి నీళ్లల్లో మునిగి నాటకం వేసి అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసారు. ఈ ప్రయత్నానికి పునాది వేసినతని పేరు అలెగ్జాండర్. నానా ఇబ్బందులు పడి నీటి లోపల ఓ గాజు గది తయారుచేసి దానిలో 30మంది నటుల చేత నాటకం చేయించడం అంటే మాటలా? అయితే గజ ఈతగాళ్ళు మాత్రమే ఈ నాటకంలో నటించాలనే నిబంధన కూడా వుంది. అయితే ఈ నాటకం చూడడానికి వచ్చిన ప్రేక్షకులు మాత్రం చాలా అబ్బుర పడ్తున్నారు.

- శిరీష




"అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకోసం మీ బెడ్రూం కిటికీలోంచి ప్రసరించే వెన్నెలని ఎంజాయ్ చేయడానికి ఒప్పుకునేవాళ్ళు వేరే వున్నారు. వాళ్లని ట్రై చేసుకోండి'' కోపంతో ఊగిపోతూ వెళ్లిపోయింది.

మరో పావుగంటలో రిజిగ్నేషన్ లెటర్‌తో వచ్చింది.

"సునందా! అయాం సారీ! నిన్ను తక్కువ అంచనా వేసినందుకు నన్ను క్షమించు. నీకు మాటిస్తున్నాను. ఇంకెప్పుడూ నీతో ఇలా ప్రవర్తించను. నా మూలంగా మన కంపెనీ ఓ మంచి ఎంప్లాయిని పోగొట్టుకోవడం నాకిష్టంలేదు'' అన్నాను సిన్సియర్‌గా.

నా అపాలజీతో కొద్దిగా శాంతించింది సునంద. రిజిగ్నేషన్ లెటర్ తీసుకుని మౌనంగా వెళ్లిపోయింది.

ఇంటికెళ్లాక ఒకటే ఒళ్ళునొప్పులు.

మరి కొద్దిసేపటికి టెంపరేచర్ బాగా పెరిగిపోయింది.

విపరీతమైన జ్వరం, చలి. ఇంటికి ఫోన్ చేస్తే అమ్మ కంగారు పడుతుందని చేయలేదు.

డాక్టర్ దగ్గరకు వెళ్లే ఓపికలేదు.

ఓపిక తెచ్చుకుని క్రోసిన్ తెచ్చుకుని వేసుకున్నాడు.

ఎందుకో వేడి వేడి కాఫీ తాగాలనిపించింది. మళ్లీ కిందకు వెళ్ళే ఓపిక లేదు. ఎంత విచిత్రం? కోట్లకు అధిపతినైనాగానీ పదిరూపాయలుకూడా ఖరీదు చేయని కాఫీ కోసం తెల్లవార్లూ జ్వరతీవ్రతతో బాధపడుతూ వేచి ఉండాల్సి వచ్చింది.

ఎందుకో మొదటిసారిగా ఒంటరితనం అంటే అమితమయిన భయం కలిగింది.

***

దాదాపు సంవత్సరం తరువాత మూర్తి వచ్చాడు.

ఏదో కాన్ఫరెన్స్ అటెండ్ అవడానికి వచ్చాట్ట. ఆ సందర్భాన్ని మిత్రులందరూ బాగా సెలబ్రేట్ చేసుకున్నాం.

వెళ్లేటప్పుడు పాపం మూర్తి బాగా ఫీలయ్యాడు.

మూర్తికి సెండాఫ్ ఇచ్చి ఇంటికి వచ్చాను.

ఇల్లంతా బావురుమంటూ తెలియని భయాన్ని కలిగించింది.

ఎప్పట్లా రెండు పెగ్గులు ఫిక్స్ చేసుకుని కొద్దిసేపు టీవీ చూసి మంచంమీద ఒరిగిపోయాను.

ఓ అర్ధరాత్రి అకస్మాత్తుగా మెలకువవచ్చింది.

కళ్ళు తెరవగానే కనబడిన దృశ్యానికి భయంతో వొణికిపోయాను.

చుట్టూ నిర్జీవమైన గోడలు, ఇంట్లో వున్న వస్తువులన్నీ జీవరహితమైపోతున్నాయి.

ఆ తరువాత అంతా చీకటి.

భయంకరమైన నిశ్శబ్దం.

దాహంతో నాలుకు పిడచకట్టుకుపోయింది.

ఉన్నట్టుండి చుట్టూరా వున్న చీకటంతా నన్ను కమ్ముకోవడం ప్రారంభించింది.

వదిలించుకుందామని ప్రయత్నించికొద్దీ అది నన్ను ఆక్రమించుకుంటోంది.

చప్పున లేచి కూర్చున్నాను.

ఒళ్లంతా చెమటతో తడిసిపోయింది.

బెడ్‌లైట్ డిమ్‌గా వెలుగుతోంది.

పైన సీలింగ్‌ఫాన్ క్రమబద్ధంగా తిరుగుతోంది.

'ఓహ్! ఇదంతా కలన్నమాట!'

జరిగినదంతా కల అని తెలియగానే కొద్దిగా రిలీఫ్‌గా అనిపించింది.

***

"నిర్జీవమైన గోడలా?'' పగలబడి నవ్వాడు జయరాం.

ఆ తరువాత చాలాసేపు తెరలు తెరలుగా నవ్వుతూనే వున్నాడు.

ఏదో పనుండి జయరాం మా ఆఫీసుకు వచ్చాడు.

మాటల మధ్యలోరాత్రి నాకొచ్చిన కల గురించి చెప్పాను.

దానికి జయరాం రియాక్షన్ ఇది.

"అంటే మీ ఇంట్లో గోడలకు ప్రాణం లేదన్న మాట. మా అందరి ఇళ్లల్లో గోడలకు ప్రాణం వుందన్నమాట.

అయితే మా ఇంట్లో గోడలతో మాట్లాడి వస్తాను. ఈలోగా ఎందుకైనా మంచిది సైకియాట్రిస్టను కలువు'' పడీ పడీ నవ్వుతూ సెలవు తీసుకున్నాడు.

జోక్‌గానే అన్నా అంతవరకూ నాకు తట్టని పరిష్కారాన్ని జయరాం సూచించాడు.

వెంటనే సైకియాట్రిస్టను కలవాలని నిర్ణయించుకున్నాను.

అక్కడే ఉండి కంప్యూటర్ దగ్గర పని చేసుకుంటున్న సునంద వటుకు నావంక జాలిగా చూసింది.

***

"కలల మనిషి మానసిక స్థితికి అద్దం లాంటిది.

అచేతనావస్థలో మనిషి మనసు అట్టడుగు పొరల్లోని భావాలను కలల రూపంలో బయట పడతాయి.

మీకొచ్చే కల భయంకరమైన మీ మానసిక స్థితికి నిలువెత్తు అద్దంలాంటిది. భయంకరమైన మానసిక ఒంటరితనంతోనూ, డిప్రెషన్‌లోనూ మీరు బాధపడుతున్నారని మీకొచ్చే కలలనుబట్టి అర్థమవుతోంది''

"నో నెవ్వర్!'' గట్టిగా అరిచాను.

డా.సుందరం నావైపు చూసి అర్ధవంతంగా నవ్వాడు.

సిటీలోకెల్లా పేరున్న సైకియాట్రిస్ట్ ఆయన. ఎంతో కష్టంమీద ఈవేళ ఆయనతో అపాయింట్‌మెంట్ దొరికింది.

అరగంటపైనే నాకు తరచుగా వచ్చే కల గురించి ఓర్పుగా విన్నారు.

"ప్లీజ్ ప్రొసీడ్'' చిరునవ్వుతో అన్నాడు.

"ఒక్క క్షణం కూడా తీరిక లేకుండా బిజినెస్ పనులతో సతమతమయ్యే నాకు మానసిక ఒంటరితనం, డిప్రెషనా? నెవ్వర్'' కోపాన్ని కంట్రోల్ చేసుకుంటూ అన్నాను.

"బిజీగా వున్నది మీ మెదడు మీ మనసు కాదు. మిస్టర్ భార్గవా! సంతోషంగా ఉన్నానని మిమ్మల్ని మీరు మభ్యపెట్టుకోకండి. మనిషి సంఘజీవి. జంతువుల్లాగా అడవిలోనో, బోనులోనో ఒంటరిగా జీవించలేడు. పెళ్లి చేసుకోకపోయినా అన్ని సుఖాలను అనుభవించానని అన్నారు. దానివల్ల మీరు సుఖంగా ఉండవచ్చు. కానీ సంతోషంగా ఉండలేరు.

కుటుంబ జీవితం గడిపే మనుషులందరికీ ప్రాణంలేని గోడలు కూడా సజీవంగా తోస్తాయి. చలనంలేని వస్తువులుకూడా చైతన్యవంతంగా కనిపిస్తాయి.

ఆఫ్టాల్ వి ఆర్ హ్యూమన్ లీవింగ్స్ మిస్టర్ భార్గవా. మన కష్టాన్ని, సుఖాన్ని పంచుకోవడానికి మనకంటూ ఆత్మీయులుండాలి. కుటుంబం అనేది సంఘజీవి అయిన మనిషి జీవిత పయనంలో గమ్యం. గమ్యంలేని ప్రయాణం నిస్సారంగా, లైఫ్‌లెస్‌గా వుంటుంది''

"కానీ ఆ కుటుంబమే మనిషి స్వేచ్ఛకు సంకెళ్ళు వేస్తుంది. మనిషిని గానుగెద్దులా చేసే కుటుంబం అంటే నాకసహ్యం.

నా చిన్నతనంలో మమ్మల్ని పెంచి పెద్ద చేయడానికి మా నాన్న ఎన్ని కష్టాలు పడ్డాడో, ఎన్ని కోల్పోయాడో నాకు తెలుసు.

అందుకే బాధ్యతల సుడిగుండంలోకి నెట్టేసే పెళ్లంటే నాకస్సలు ఇష్టంలేదు. అయినా వివాహబంధంలో నిజాయితీ ఎంతవరకు వుంది?'' ఆవేశంగా అన్నాను.

నా మనసులో భావాల్ని సక్సెస్‌ఫుల్‌గా చెప్పినందుకు చిన్నగా మందహాసం చేసాడు డా.సుందరం.

"వెల్ మిస్టర్ భార్గవా! పెళ్లంటే స్వేచ్ఛకు సంకెళ్ళు అన్నారు. స్వేచ్ఛ ఆటవిడుపులా అప్పుడప్పుడు ఉంటేనే అందం. రోజూ తింటే తీపయినా వెగటు పుడుతుంది.

ఇకపోతే పెళ్లంటే బాధ్యతల సుడిగుండం అన్నారు. సమస్యలను అధిగమించి బాధ్యతలను సక్రమంగా నెరవేర్చినప్పుడు కలిగే సంతృప్తి గురించి సక్సెస్‌ఫుల్ బిజినెస్‌మాన్ అయిన మీకు చెప్పనక్కర్లేదనుకుంటా. వివాహవ్యవస్థలో కొన్ని లోపాలున్నంతమాత్రాన వివాహబంధాన్నే ద్వేషించడం తప్పు.

శరీరంలో ఏ భాగానికయినా గాయం అయితే దాన్ని నయం చేసుకుంటాంగానీ ఆ శరీరావయవాన్నే వదులుకోముగదా! ఐ థింక్ యు ఆర్ ఎబౌ పార్ట్.

ఈ వయసులోనే మనిషికి తోడు చాలా అవసరం. ఈ విషయాన్ని నిర్లక్ష్యం చేస్తే మీ డిప్రెషన్ మరింత ముదురుతుంది. ఇట్ ఈజ్ పాజిటివ్ థింకింగ్ దట్ మేక్స్ ఆల్ ద ఇఫరెన్స్. ఇప్పటికైనా మించిపోయింది లేదు. చక్కగా పెళ్లి చేసుకుని ఆ డిఫరెన్స్‌ని ఎంజాయ్ చేయండి. బెటర్ లేట్ దాన్ నెవ్వర్!''

***

చక్కని పూలతోట. పరిమళభరితమయిన వాతావరణం.

అందమైన ప్రపంచం.

నా చుట్టూ ఉన్న సమస్తం నవజీవంతో చైతన్యవంతంగా వున్నాయి.

ఉన్నట్టుండి మెలకువ వచ్చింది.

నైట్‌క్వీన్ పరిమళంతో కిటికీలోంచి గదంతా పరుచుకున్న వెన్నెల ఆహ్లాదకరంగా ఉంది.


పక్కనే ఆదమరచి నిద్రపోతోంది సునంద.

పైట చాటు నుంచి పచ్చగా మెరుస్తున్న మంగళసూత్రాలు, నుదుట నిండైన కుంకుమ.

చిన్నగా నవ్వుకుంటూ మంచి నీళ్ళు తాగడానికి మంచం దిగాను.

ఎదురుగా ఉన్న అందమైన స్టాండు మీద వయ్యారంగా వున్న ఫ్రేములో మా పెళ్లి ఫోటో.

★



## ఆచరణ

జీవితం గురించి పాజిటివ్‌గా ఆలోచించాలంటారు పెద్దలు. లారదత్తా ఎప్పుడూ ఇలాగే ఆలోచిస్తుందిట. జీవితంలో ఎన్ని కష్టాలొస్తే అంత మంచి జీవితం ముందుంటుంది. ఏ విషయమైనా అన్ని కోణాల నుంచి ఆలోచించాలి' అంటోంది లారాదత్తా. ఆమె ఆహార్యంలో ఇప్పుడు చాలా మార్పులు కన్పిస్తున్నాయి. ఎప్పుడూ డిఫరెంట్‌గా ఉండేందుకు ఆమె అనేక డిజైన్స్ ఉన్న డ్రెస్సుల్ని వేసుకుంటుంది. ఆమె వార్డ్‌రోబ్‌లో ఎప్పుడూ యాభై జతల కొత్త డ్రెస్‌లు ఉంటాయిట.

